మార్కెట్‌కు మోక్షం లేదా..?



అర్ధాంతరంగా ఆగిన మున్సిపల్ మార్కెట్ నిర్మాణం

వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం పేరుతో అభివృద్ధిని జగన్ గాలికి వదిలేశారు. కేవలం జీవోలు విడుదల చేసి శంకుస్థాపనలకు పరిమితమై అభివృద్ధి పనులకు ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. దీంతో చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు తీస్తుందని ప్రజలు ఓట్లేసి గెలిపించారు. అయితే.. జగన్ హయాంలోనే ఖజానాను ఖాళీ చేసి అప్పుల భారం మోపడంతో చంద్రబాబు ప్రభుత్వం సైతం అభివృద్ధి పనుల పూర్తికి నిధులు కేటాయించలేని స్థితి నెలకొంది. దీంతో ప్రత్యామ్నాయాలపై దృష్టిసారిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరు మున్సిపల్ మార్కెట్ నిర్మాణం పూర్తి అవుతుందో కాదో అనే అనిశ్చితి నెలకొంది.

- రూ.60.85 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మాణం
- బిల్లులు రాక ఆగిపోయిన పనులు
- నిర్మాణం పూర్తి కావాలంటే మరో రూ.40 కోట్లు అవసరం
- ప్రభుత్వ గ్రాంట్ రాదని స్పష్టం చేసిన కలెక్టర్
- షాపింగ్ కాంప్లెక్స్‌తో నిధుల సమీకరణకు యత్నాలు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున వైసీపీ ప్రభుత్వం 2022 నవంబరులో ప్రతిష్టాత్మకంగా రూ.60.85 కోట్లతో చేపట్టిన మున్సిపల్ కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులు నిధుల లేమితో ఈ ఏడాది జనవరి నుంచి నిలిచిపోయాయి. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తి కావాలంటే గుడ్‌విల్ యాక్షన్ ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది. కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తిచేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని అందువల్ల దీని పూర్తికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అనేకమార్లు కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్న దృష్ట్యా మార్కెట్ నిర్మాణానికి తక్కిన రూ.40 కోట్ల నిధులు ఇవ్వలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. ఏప్రిల్ 23న ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ చెరకూరి శ్రీధర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు రావని ఈ సమావేశంలో కలెక్టర్ స్పష్టం చేశారు. గుడ్‌విల్ యాక్షన్‌పై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలో గుడ్‌విల్ యాక్షన్‌లో ఎంతవరకు నిధుల సమీకరించవచ్చు, ఎన్నిగదులు ఉన్నాయి అనే వాటిపై సమగ్ర నివేదికతో రావాలని కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే కౌన్సిల్ తీర్మానం చేసి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

బిల్లులు రాకపోవడంతో..

ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున శివాలయం సర్కిల్లో 2.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.60.85 కోట్లతో చేపట్టిన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.21 కోట్లు విడుదల చేసింది. ఇంకా రూ.40 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. మార్కెట్ నిర్మాణం చేపట్టిన కేపీసీ కాంట్రాక్ట్ సంస్థ రూ.20.5 కోట్ల మేర పనులు పూర్తి చేసింది. ఇందుకు గాను కాంట్రాక్టర్‌కు కేవలం రూ.5.18 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.15 కోట్ల మేర కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాల్సి ఉంది. రూ.21 కోట్లు విడుదల అయినా సీఎఫ్ఎంఎస్‌ల బిల్లులు నిలిచిపోయాయి. కొత్త నిబంధనలు వచ్చేదాకా బిల్లులు మళ్లీ అప్‌లోడ్ చేసే అవకాశం లేదు. దీంతో కాంట్రాక్టర్ ఈ ఏడాది జనవరి నుంచి పనులు ఆపేశారు.

పనుల నత్తనడక

ఇప్పటి వరకు మార్కెట్ చుట్టూ గ్రౌండ్ ఫ్లోర్ రిటైనింగ్ వాల్స్, సెల్లార్ బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ వరకు లిఫ్టులు ర్యాంపులు పూర్తయ్యాయి. లోయర్ మార్కెట్ స్లాబ్ పూర్తి చేసి అప్పర్ మార్కెట్ నిర్మాణానికి కాలమ్స్ పూర్తి చేశారు. 2022 నవంబరులో ప్రారంభించిన ఈ మార్కెట్ నిర్మాణ పనులు 2024 నవంబరుకు పూర్తి చేయాల్సి ఉంది. కానీ అనేక అవాంతరాల మధ్య పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. గత ఏడాది నవంబరుతో గడువు ముగియడంతో ఈ ఏడాది డిసెంబరు వరకు గడువు తీసుకున్నారు. కానీ ఈ పరిస్థితుల్లో మరో రెండేళ్లకయినా మార్కెట్ నిర్మాణం పూర్తవుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

గుడ్‌విల్ వేలంకోసం కసరత్తు

మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తక్కిన రూ.40 కోట్ల నిధులు ఇవ్వలేమని జనవరి 6వ తేదీన స్పష్టం చేస్తూ నోట్ పంపింది. స్థానికంగా బ్యాంకు లోనుకు వెళ్లడం లేదా మార్కెట్‌లో నిర్మించబోయే షాపింగ్ రూములకు గుడ్‌విల్ కింద యాక్షన్ పాడి నిధులు సమీకరించుకోవాలని తెలిపింది. ఈ నెల 23న కలెక్టర్ సైతం నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఇదే విషయాన్ని వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాలతో గుడ్‌విల్ యాక్షన్ కోసం కసరత్తు చేపడుతున్నాం. మొత్తం రూములకు ఎంత నిధులు సమీకరించవచ్చో అంచనా వేస్తున్నాం. మార్కెట్‌పై నివేదిక పూర్తిచేసి ఈ అంశంపై తీర్మానం కోసం త్వరలో కౌన్సిల్ ముందు ఉంచబోతున్నాం.

- మల్లికార్జున,
మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

సామాన్యుడికి న్యాయం జరగాలి

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌కు వచ్చే సామాన్యుల ఫిర్యాదులకు తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రికెట్‌బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో పర్యాటకులు సందర్శించే నదులు, చెరువులు, వంకలు ఇతర నీరు నిల్వ ఉండే కుంటల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు గస్తీ పెంచాలని ఆదేశించారు. కడప నగరం రింగు రోడ్డుతో శివారు ప్రాంతాలు, ప్రొద్దుటూరు పట్టణ శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గంజాయి సేవించే అవకాశం ఉన్న ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని, గతంలో ప్రమాదాలు జరిగిన బ్లాక్ స్పాట్స్, హాట్‌స్పాట్స్ గుర్తించి ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూలనాగరాజు



కడప బస్టాండులో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మహిళలకు త్వరలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు స్పష్టం చేశారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ హోదాలో తొలిసారి కడపకు విచ్చేసిన ఆయన తొలుత ఆర్టీసీ బస్టాండు, కొత్త గ్యారేజీ, పాత గ్యారేజీ, ఆర్టీసీ హాస్పిటల్‌ను సందర్శించారు. ఆ మేరకు కొత్త గ్యారేజీలో పూలమొక్కలు నాటారు. తదనంతరం గ్యారేజీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇక్కడి అధికారులు ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. త్వరలోనే ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఆర్టీసీ కొత్త గ్యారేజీ నిర్మాణం మరో మూడు నెలల్లో పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ ప్రధాన వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, కడప డిపో మేనేజరు డిల్లీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే 4న జరిగే నీట్ యూజీ-2025 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో నీట్ యూజీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో 2, కడపలో 6 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ పరీక్షలకు 2,428 మంది విద్యార్థులు హాజరుకానున్నారని అన్నారు. దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోనికి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, డీఈవో షంషుద్దీన్, నీట్ కో-ఆర్డినేటర్ మునీశ్ మీనా తదితరులు పాల్గొన్నారు.

అగ్రగామిగా ఏపీజీబీ



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

కడప వినాయకనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రూ.2,667 కోట్ల డిపాజిట్‌లు, రూ.87,090 కోట్ల రుణాలతో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఆ బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్ తెలిపారు. కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.639 కోట్లు నికర ఆదాయం ఆర్జించిందని అతి తక్కువ (1.22 శాతం) నిరర్థక ఆస్తులను కలిసి ఉందని తెలిపారు. తమ బ్యాంకు 10 జిల్లాల్లోని 56 లక్షల ఖాతాదారులకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందిస్తోందన్నారు. 6,90,538 మంది రైతులకు రూ.8,798 కోట్ల పంట రుణాలు, 1,20,653 మహిళా సంఘాలకు రూ.6,867 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ వికాస్, సప్తగిరి, చైతన్య గోదావరి బ్యాంకులు కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా విలీనం అవుతున్నాయని తెలిపారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు వ్యవహారం ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. సమావేశంలో జనరల్ మేనేజర్లు హరికిశోర్ ప్రసాద్, పీఆర్ పడిగెట్‌దాల్, సంజీవప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తాం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



జిల్లా ఉద్యానశాఖ సమ్మేళనంలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

6

చెన్నకేశవుడికి చందనోత్సవం

- మయూర వాహనంపై పరమేశ్వరుడు

వల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కామాక్షి సమేత వైద్యనాథేశ్వరుడు, రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి దేవాలయాల్లో ప్రాతఃకాలాన్నే పరమేశ్వరునికి ప్రీతికర అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం లఘు పూర్ణాహుతి, మహామంగళహారతి నిర్వహించారు. ప్రదోషకాలంలో వైద్యనాథేశ్వరుడిని సుందరంగా అలంకరించి మయూర వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. కొండపైన చెన్నకేశవస్వామి మూలవిరాట్టుకు చందన అలంకారాన్ని గావించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రదోష కాలంలో పూజలు నిర్వహించిన అనంతరం చెన్నకేశవస్వామిని హనుమద్‌వాహనంపై ఊరేగించారు. కాగా.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పుష్పగిరి గ్రామాన్ని, కొండపైనా శుభ్రం చేశారు.



చందనాలంకారంలో చెన్నకేశవుడు

కడప మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు



కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కడప మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. చర్లపల్లె తిరుపతి మధ్య మే నెలలో ప్రత్యేక రైలు నడవనుందన్నారు. 07257 నెంబర్ రైలు 8, 15, 22, 29 తేదీల్లో గురువారం సాయంత్రం 4.30 గంటలకు చర్లపల్లెలో బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 4.28గంటలకు, అదేరోజు ఉదయం 9.40కి తరుపతి చేరుకోనుందన్నారు. తిరుగు ప్రయాణంలో 07258 నెంబర్ రైలు 9, 16, 23, 30 తేదీల్లో శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటలకు బయలుదేరి కడపకు మధ్యాహ్నం 2.43గంటలకు చేరుకుని చర్లపల్లెకు శనివారం ఉదయం 4.30గంటలకు వెళ్లనుందన్నారు. అలాగే మరో రైలు ఖాజీపేట-తిరుపతి మధ్య నడపనున్నారు. 0723 నెంబర్ గల ఈ రైలు ఖాజీపేట నుంచి మే 6, 13, 20, 27 తేదీలు, జూన్ 3, 10, 17, 24 తేదీలలో మంగళవారం మధ్యాహ్నం 1.30గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం కడపకు 4.28కు, బుధవారం ఉదయం 9.40గంటలకు తిరుపతి చేరుకోనుందన్నారు. తిరుగు ప్రయాణంలో (17254) తిరుపతిలో మే 7, 14, 21, 28 తేదీల్లోను, జూన్ నెల 4, 11, 18, 25 తేదీల్లో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 2.43గంటలకు కడపకు, మరుసటి రోజు ఉదయం 8గంటలకు ఖాజీపేటకు వెళుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మీరు ఎక్కువ ఊహించుకోవద్దు

- జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో గెలిచారు
- ఎమ్మెల్యేలకు చంద్రబాబునాయుడు హెచ్చరిక




(కడప-ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలన అదో నరకం. సమస్యలన్నింటినీ పంటిబిగువునా జనం భరించారు. ఎన్నికల సమయంలో ఓటుతో జగన్ గ్యాంగ్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు తొలిసారిగా గెలిచారు. అయితే జగన్ కోటను తాము బద్దలు కొట్టాం.. తామే రాజులం అనుకుంటున్నారు. వాస్తవానికి వీరంతా గెలిచింది జగన్ సర్కారు వ్యతిరేకతతోనే. టీడీపీ అధికారంలోకి వస్తే తమ భూములు, ఆస్తులు, స్థలాలు పోవనే నమ్మకంతో చంద్రబాబుకు జై అంటూ ఓట్లు వేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చి సంవత్సరం కాకముందే జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు వైసీపీ పోకడలే అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండురోజుల క్రితం రాయలసీమ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు. "నిన్న వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకతతో గెలిచారు. అయితే మీరే గెలిచినట్లు అనుకుంటున్నారు. అది కాదు.. 2029లో ఎంతమంది అసెంబ్లీకి వస్తారో చూస్తాను. ఈ నాలుగేళ్ల పాలన నడవడిక మీ గెలుపునకు కీలకం" అని సీఎం చంద్రబాబు స్పష్టంగా వెల్లడించారు. జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలు కేడరును పూర్తిగా దూరం పెట్టారు. ఎమ్మెల్యే సీటును గెలుచుకున్నది మేమే అనే అహంభావం వారిలో ఉంది. వాస్తవంగా అయితే జగన్ హయాంలో జరిగిన భూకబ్జాలు, అరాచకాలు తట్టుకోలేక జనం వీరిని ఎమ్మెల్యేలుగా గెలిపించారు. అయితే కొందరు ఎమ్మెల్యేలలో మాత్రం తామే గెలిచామనే పొగరు ఉంది. ఇలాంటి వారిపై ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ రిపోర్టు వెళ్లింది. అందుకే చంద్రబాబు కూడా ప్రభుత్వ వ్యతిరేకతతో నిన్న జరిగిన ఎన్నికల్లో గెలిచారు. మీ పని తీరుతోనే వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీలోకి అడుగుపెడతారు అంటూ వార్నింగ్ ఇచ్చారు.

రూ.35 కోట్లు మట్టిపాలు..!

- మూడు ఎత్తిపోతల పథకాలకోసం రూ.35 కోట్లు ఖర్చు
- పనులు నాసిరకం కావడంతో పైపులు లీకేజీ
- మూడు చెరువులకు నీళ్లు సరఫరా కాని వైనం
- ఇదీ రాజసేతుసాగర్ నుంచి ఎత్తిపోతల పథకాల దుస్థితి

రాజసేతుసాగర్ నుంచి మూడు చెరువులకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందిస్తామని చెప్పి దాదాపు రూ.35కోట్లతో పనులు చేపట్టి 90శాతం పూర్తిచేసి గాలికొదిలేశారు. పైప్‌లైన్లు, మోటార్ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్లు అన్నీ సమకూర్చినా.. పనుల్లో నాణ్యత లేకపోవడంతో మూలనపడేసే దుస్థితి నెలకొంది. దీంతో ఈ మూడు ఎత్తిపోతల పథకాలకు ఖర్చుచేసిన రూ. 35 కోట్లు మట్టిపాలేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పులివెందుల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం ఇనగలూరు సమీపంలో మొగమోరు వాగుపై రాజసేతుసాగర్ నిర్మించారు. ఈ రాజసేతుసాగర్ నుంచి గంగాదేవిపల్లె, తొండూరు, మల్లేల చెరువులకు ఎత్తిపోతల పథకల ద్వారా నీటిని మళ్లించేందుకు 2008లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.35కోట్లతో పనులు చేపట్టింది. పులివెందుల బ్రాంచ్ కెనాల్ ద్వారా నీరు వచ్చినా, పైడిపాళెం నుంచి విడుదల చేసినా రాజసేతుసాగర్‌లోకి నీరు చేరుతుంది. రెండు వైపుల నుంచి నీటి లభ్యత ఉండడంతో చెరువులకు ఈ పథకాల ద్వారా నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.35కోట్లతో పనులు చేపట్టింది. రాజసేతుసాగర్ నుంచి మల్లేలచెరువు వరకు 8కి.మీ మేర పైప్‌లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే తొండూరు చెరువుకు 5 కి.మీ, గంగాదేవిపల్లె చెరువుకు 4.50 కి.మీ ఏర్పాటుచేయాలి. వీటికోసం 110హెచ్‌పీ మోటార్ల సాయంతో రాజసేతుసాగర్ నుంచి ఈ చెరువులకు నీటిని అందించేందుకు ప్రభుత్వం పనులు చేపట్టింది. 2008లో పనులు ప్రారంభమైనా అత్యంత నెమ్మదిగా నత్తనడక కంటే అధ్వాన్నంగా సాగాయి. పనులు చేపట్టిన ప్రైవేటు సంస్థ రెండేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటే దాదాపు ఆరు సంవత్సరాల పాటు పనులు సాగదీసింది. ఆ పనులు కూడా నాసిరకంగా చేపట్టింది.



రాజసేతుసాగర్ వద్ద నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలు

చేతులెత్తేసిన అధికారులు

2015లో రాజసేతుసాగర్ నుంచి ఈ ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు నీటిని మళ్లించేందుకు మోటార్లను ఏర్పాటుచేశారు. ఆ సందర్భంలో 12చోట్ల పెద్దఎత్తున లీకేజీలు వచ్చాయి. దీనితో మోటార్లు ఆపేసి రెండు దఫాలుగా మరమ్మతులు చేశారు. కానీ ఒకచోట మరమ్మతులు చేస్తే మరోచోట లీకవుతూ వచ్చాయి. దీంతో అధికారులు చేసేదేమీలేక ఈ పైప్‌లైన్ల ద్వారా నీటిని మళ్లించలేమని చేతులెత్తేశారు. దీనితో ఎత్తిపోతల పథకాల నుంచి చెరువులకు నీటిని అందించే కార్యక్రమానికి స్వస్తిపలికారు.

కాపర్ తీసుకెళ్లిన దొంగలు

వైసీపీ హాయంలో ఈ పనులు చేపట్టాలని తొండూరు మండల నాయకులు కొందరు ప్రతిపాదించినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పైప్‌లైన్లు ఏర్పాటుచేసి విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు బిగించినా ఏ ఉపయోగము లేకపోవడంతో రైతులు నిట్టూరుస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు రాజసేతుసాగర్ వద్ద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగులగొట్టి కాపర్ తీసుకెళ్లారు. అప్పటి నుంచి వీటిని పట్టించుకోలేదు. మోటార్లు, పైపులు ఉన్నా నిరుపయోగంగా పడిఉన్నాయి. ఏదిఏమైనా రాజసేతుసాగర్ నుంచి చేపట్టిన మూడు ఎత్తిపోతల పథకాలకు ఖర్చు చేసిన మొత్తం మట్టిపాలైంది. కూటమి ప్రభుత్వం అయినా దీనిపై చర్యలు తీసుకుని పైపులైన్లకు మరమ్మతులు చేసి చెరువులకు నీరందించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఐస్..యాపిల్

● తాటిముంజలతో వేసవిలో ఉపశమనం ● అధికంగా తీసుకోవడం శ్రేయస్కరమంటున్న వైద్యులు



పీలేరు/పీలేరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఎర్రటి ఎండలతో ఠారెత్తిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, ఉక్కపోత, వడగాల్పులు, చెమట ధారలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. విభిన్న వాతావరణ పరిస్థితులు సృష్టించే ప్రకృతి, వాటిని ఎదుర్కొనే ఉపాయాలనూ బోధిస్తుంది. అలా ఎండల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రకృతి తాటిముంజలను ప్రసాదించింది. కేవలం ఎండా కాలంలో మాత్రమే దొరికే ఇవి ఎండ వేడిమి నుంచి కాపాడడమే కాకుండా అనేక ఆరోగ్య గుణాలు కూడా కలిగి ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. చూడడానికి జెల్లీలా, నోటిలో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. అందువల్ల శరీరానికి చలువ చేస్తుంది. అందుకే వాటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎండా కాలంలో తాటి ముంజలను అధికంగా తీసుకోవడం ద్వారా వడదెబ్బతో పాటు అనేక అనారోగ్య సమస్యల నుంచి తప్పించుకోవచ్చునని వారు తెలిపారు. గత మూడు రోజులుగా ఇవి పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున దొరుకుతున్నాయి. పీలేరు పరిసర ప్రాంతాల్లో తాటి చెట్లు లేకపోయినప్పటికీ పొరుగునే ఉన్న చిత్తూరు జిల్లా ఐరాల, పూతలపట్టు మండలాల్లోని పలు ప్రాంతాల నుంచి పలువురు మహిళలు, వ్యాపారులు వాటిని పీలేరులో విక్రయిస్తున్నారు. డజన్ తాటి ముంజలు రూ.70 నుంచి రూ.100 చొప్పున అమ్ముతున్నామని వారు తెలిపారు.



పీలేరులో తాటిముంజలను విక్రయిస్తున్న వ్యాపారులు

అనేక ఆరోగ్య ప్రయోజనాలు...

● వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి తాటిముంజలు ఎంతగానో ఉపయోగపడతాయి. వాటిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల వాటిని తింటే అధిక దాహార్తి తగ్గుతుంది. వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు. శరీర ఉష్ణోగ్రతను అదుపులో పెడతాయి. శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడుతాయి.

● వీటిలో ఎక్కువ తేమ, తక్కువ కొవ్వు ఉండడంతో అవి త్వరగా జీర్ణమై అసిడిటీ, పొట్ట ఉబ్బరం తగ్గి జీర్ణప్రక్రియను సజావుగా చేస్తాయి. చిన్నారులు, హృద్రోగులు, షుగర్ కలిగిన వారు, అధిక బరువుతో బాధపడే వారికి ఇవి ఎంతగానో మేలు చేస్తాయి.

● తాటిముంజలో ఎక్కువగా ఉండే పొటాషియం బీపీని కంట్రోల్ చేస్తుంది. తద్వారా గుండె జబ్బులను నివారిస్తుంది. అంతేకాకుండా శరీరంలోని హానికర వ్యర్థాలను బయటకు పంపడంతో పొటాషియం ఎంతగానో సహాయపడుతుంది.

● దొరికినంత కాలం తాటిముంజలను క్రమం తప్పకుండా తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. తద్వారా లివర్ సమస్యలను అధిగమించవచ్చు.

● తాటి ముంజలు మహిళలకు ప్రకృతి ప్రసాదించిన వరం లాంటివి. వారిలో ఎక్కువగా కనిపించే రొమ్ము క్యాన్సర్ రాకుండా చూడడంతో తాటిముంజలు అద్భుతంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. రొమ్ము క్యాన్సర్ కారక పెట్రో కెమికల్స్, ఆంథోసైనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయని అనేక అధ్యయనాలు వెల్లడించాయి.

● ఎండ కారణంగా తరుచూ బయట తిరిగే వారిలో కనిపించే వికారం, వాంతులను ముంజలు నివారిస్తాయి. వేసవిలో వచ్చే చికెన్ పాక్స్(అమ్మవారు)ను కూడా నివారించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

● వేసవిలో ఎక్కువ సమయం ఆరుబయట ఆడుకునే చిన్నారుల్లో కనిపించే దద్దుర్లు వంటి చర్మ సమస్యలను సైతం తాటి ముంజలు తగ్గిస్తాయని వైద్య శాస్త్రం చెబుతోంది. దద్దుర్లపై తాటిముంజలతో మర్దన చేస్తే అవి మాయమైపోతాయి. వీటితోపాటు అధిక బరువు, గర్భిణీ, బాలింత మహిళలు, నెలసరి ఇబ్బందులు వంటి అనేక సమస్యలకు తాటిముంజలు బాగా పనిచేస్తాయని, వాటిని అధికంగా తీసుకోవాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

ప్రకృతి ప్రసాదించిన వేసవి వరం



వేసవి ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ప్రకృతి మనకు ప్రసాదించిన వరం తాటిముంజలు. ఎంఎన్‌సీలకు చెందిన కూల్‌డ్రింక్స్ తాగే బదులు సహజసిద్ధంగా వచ్చే తాటిముంజలను తినడం ఎంతో మేలు. వాటిలో ఉండే ఔషధ గుణాలు తెలుసుకునే మన పూర్వీకులు వాటిని ఎక్కువగా తినమని సూచించారు. అయితే ఆధునికీకరణ పేరుతో మనలో చాలా మంది వాటి వైపు చూడడం లేదు. రోడ్డు పక్కన అతిచవకగా దొరికే ముంజలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని చిన్నచూపు చూడకుండా అవి ఎంత కాలం దొరుకుతాయో అంతకాలం తింటే మంచిది. అప్పుడే మనం ఎండల నుంచి ఉపశమనం పొందగలం.

-డాక్టర్ పవన్‌కుమార్, చిన్నపిల్లల వైద్యుడు, పీలేరు

హార్సిలీహిల్స్ విహారయాత్రలో విషాదం

● గంగోత్రి కొలనులో యువకుడి గల్లంతు

● ఆచూకీ కోసం పోలీసుల విఫలయత్నం



గంగోత్రిలో గల్లంతైన బాలు (ఫైల్)

బి.కొత్తకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో మంగళవారం విషాదకర సంఘటన జరిగింది. ఓ యువకుడు ఘాట్‌రోడ్డులోని గంగోత్రిలో గల్లంతయ్యాడు. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపిన వివరాల మేరకు. బి.కొత్తకోట పట్టణంలోని జయశ్రీ కాలనీకి చెందిన దేశుగారి బాలక్రిష్ణ (29) దిగువబస్టాండులో ఉన్న ఆంజనేయస్వామి గుడి ఎదుట టైలర్‌షాప్ నిర్వహించుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. అవివాహితుడైన బాలు మంగళవారం బి.కొత్తకోటకు చెందిన తన ఇద్దరు స్నేహితులతో కలిసి సరదాగా హార్సిలీహిల్స్‌కు విహారయాత్రకు వెళ్లాడు. సాయంత్రం వరకు సరదాగా సెల్ఫీలు దిగుతూ గడిపారు. హిల్స్ ఘాట్‌రోడ్డు పక్కన వున్న నీటికొలను అయిన గంగోత్రిలో దిగి ఈతకొడుతూ నీటమునిగి గల్లతయ్యాడు. తోడుగా వచ్చిన మిత్రులు భయభ్రాంతులై అందుబాటులో ఉన్న పర్యాటకులను పిలిచి సాయం అడిగారు. ఎవరు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. పోలీసులకు సమాచారం అందగానే సిబ్బంది, ఈతగాళ్లను, అగ్నిమాపక సిబ్బందిని తీసుకొని సంఘటనా స్థలానికి వెళ్లి బాలు ఆచూకీ కోసం ప్రయత్నించారు. చీకటిలో చేసేదిలేక వెనుదిరిగారు. బుధవారం ఉదయం బోట్లను, గజ ఈతగాళ్లను రప్పించి, యువకుడి ఆచూకీ కోసం ప్రయత్నించనున్నట్లు సీఐ తెలిపారు. బాలు గల్లంతైన వార్తతో బి.కొత్తకోట జయశ్రీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రామసముద్రంలో కార్డెన్‌సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

● 20 ద్విచక్రవాహనాలు సీజ్

రామసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాజుల నగిరంలో మంగళవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ ఎస్‌ఐలు రవికుమార్, దిలీప్‌కుమార్, తిప్పేస్వామి, పోలీస్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని 20 ద్విచక్రవాహనాలు, ఒక టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించొద్దని కోరారు. ప్రమాదాల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. గ్రామాల్లోని కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రెడ్డెప్ప నాయుడు మృతదేహం

బి.కొత్తకోట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బడికాయలపల్లె పంచాయతీ జింకలదాట్లపల్లెకు చెందిన గాలివీటి నరసింహులునాయుడు కుమారుడు రెడ్డెప్ప నాయుడు (45) ఇటీవల టమోటా పంట సాగు చేశాడు. గిట్టుబాటు ధరలు లేకపోవడం, పాడి ఆవులు సైతం సక్రమంగా పాలు ఇవ్వకపోవడంతో కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, రుణదాతలు ఇంటి వద్దకు తిరుగుతుండడంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేసి విచారణ చేస్తున్నట్లు బి.కొత్తకోట సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

● మే 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) కోర్సులో ప్రవేశానికి డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్‌ను రాష్ట్ర విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 29 నుంచి మే 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 8వ తేదీలోగా అందజేయాలన్నారు. అలాగే హాల్ టికెట్లు మే 20వ తేదీ విడుదల అవుతాయని, డీఈఈ సెట్ పరీక్షలు జూన్ 2, 3వ తేదీల్లో ఉంటాయన్నారు. అలాగే డైట్ సెట్ పరీక్షా ఫలితాలు జూన్ 10వ తేదీ విద్యా శాఖ విడుదల చేస్తుందన్నారు. పరీక్షా కేంద్రాల ఎంపిక, అభ్యర్థుల అర్హతల నిబంధనలు, కోర్సు ఎంపిక విధానం వంటి పూర్తి సమాచారం కొరకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలియజేశారు. ప్రాథమిక విద్యకు నాణ్యతను తీసుకొచ్చే భవిష్యత్ టీచర్లకు ఇది మంచి అవకాశం అని, ఒక్క అభ్యర్థి సకాలంలో దరఖాస్తు చేసుకొని పరీక్షకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు.

హామీల అమలేదీ : ఈశ్వరయ్య

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల వాగ్దానాలు, సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదని మంగళవారం కడపలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల్లో ప్రకటించిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ పాల్గొన్నారు.

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తాం

● కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



జిల్లా ఉద్యానశాఖ సమ్మేళనంలో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చెన్నూరుకు చెందిన పసుపు రైతు బాలచంద్రను, కామనూరుకు చెందిన రైతు రాఘవరెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుట్టాసుధాకర్ యాదవ్, వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి

సీకేదిన్నె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని, ఉద్యాన పంటల సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు చేకూరుతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. జిల్లా రైతులను ఉద్యాన సాగులో ప్రోత్సహించే దిశగా మంగళవారం స్థానిక రాయచోటి రోడ్డులోని మాధవీ కన్వెన్షన్ హాలులో జిల్లా ఉద్యానశాఖ సమ్మేళనాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా అరటి, చీనీ, పసుపు, ఉల్లిగడ్డ తదితర పంటలను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజక్షన్‌గా గుర్తించామన్నారు. ఈ పంటలను రాష్ట్రం, దేశం దాటి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందేలా చేస్తున్నామన్నారు. మన జిల్లాలో పండిన అరటి పంటకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు, ఆదరణ లభించడం మన జిల్లాకు గర్వకారణమన్నారు. పండించిన పంటకు సరైన ధర లభించడంలేదనే అంశాలపై మార్కెటింగ్ నిపుణులతో చర్చించామన్నారు. కడప జిల్లా ఉద్యాన ఉత్పత్తులను బ్రాండింగ్ చేయడం, ప్రచారం కల్పించడం, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు మౌలిక సదుపాయాలు కల్పించడం, మార్కెట్‌లో పోటీతత్వం పెంచడం, రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంపొందించడం రైతుకు ఆదాయం రెట్టింపు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

ఏపీఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కడప జిల్లా హార్టికల్చరల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర హార్టికల్చలర్, సెరీకల్చరల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే 10-15 సంవత్సరాల్లో వ్యవసాయం, ఫిషరీష్, అనిమల్, సెరీకల్చలర్, ఉద్యానశాఖ లాంటి అనుబంధ సంస్థలు చాలా అవసరమన్నారు. రైతులు ఉద్యాన సాగు ఆచరిస్తూ ప్రకృతి వ్యవసాయంలోకి మారాలన్నారు.

కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఉద్యాన పంటలకు అపారమైన అవకాశాలు, సదుపాయాలు ఉన్నాయని, ఉత్పత్తులు నిలువ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని అన్నారు.. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ కడప ఉద్యాన పంటలు ప్రపంచ వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు తెచ్చుకోవాలని, అందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ అధికారులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి రైతులకు ప్రభుత్వ పథకాలు తెలియజేయాలన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అవసరం ఎంతైనా ఉందన్నారు.

నిమ్మ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మధుమతి మాట్లాడుతూ జిల్లాలో వాటర్ రీసోర్స్ ఎంతో అనుకూలంగా, ఆశాజనకంగా ఉన్నాయన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు జిల్లాలో విపరీతమైన అవకాశం ఉందని, జిల్లాను హార్టికల్చలర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా సహజ పద్ధతిలో పసుపు సాగుచేస్తున్న చెన్నూరుకు చెందిన ఆదర్శ రైతు కె.బాలచంద్రను, బహుళ పంటలను సాగుచేస్తున్న కామనూరుకు చెందిన ఆదర్శ రైతు రాఘవరెడ్డిలను అధికారులు సత్కరించారు. అంతకుముందు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల హెచ్‌వోడీ శివప్రసాద్, రాజానాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, హార్టికల్చరల్ అధికారి జ్యోతిర్మయి, మార్కెటింగ్, ఉద్యాన సంబంధిత అధికారులు, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి బంగారు ఆభరణాలు

● తయారు చేయించి ఇచ్చిన దాతలు, కమిటీ సభ్యులు

● జాతర రోజు అమ్మవారికి ఆభరణాల అలంకరణ



బంగారు కిరీటం, మాంగ చంద్రహారం, సూర్యవంక

రైల్వేకోడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లికి దాతలు, కమిటీ సభ్యులు కలిసి బంగారు ఆభరణాలను తయారు చేయించారు. అమ్మవారి జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమౌతాయి. గురువారం జాతర నిర్వహించి, శుక్రవారం నిమజ్జనంతో జాతర ముగుస్తుంది. గంగమ్మకు మండలంలో చాలా మంది దాతలు బంగారు ఆభరణాలు చేయించడానికి ముందుకు వచ్చారు. లక్షలాది రూపాయల చందాలు వచ్చాయి. దీంతో మొదటిగా ఈ ఏడాది అమ్మవారికి బంగారు కిరీటం, తర్వాత రెండు బంగారు హస్తాలు, సూర్యవంక, మాంగచంద్రహారం, పుష్పహారం తయారు చేయించారు. అదే విధంగా పోతులరాజు విగ్రహాన్ని దాతలు తయారు చేయించి ఇచ్చారు. బుధవారం అర్ధరాత్రి మట్టితో గంగమ్మ ప్రతిమను తయారు చేస్తారు. అనంతరం అమ్మవారికి బంగారు ఆభరణాలను అలంకరిస్తామని జాతర నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి బంగారుతో జడకుచ్చులు తయారు చేయించారు. ప్రస్తుతం జరుగుతున్న జాతర వందేళ్ల పూర్తి కావడంతో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హోటళ్లు, మాంసం దుకాణాల్లో తనిఖీలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు షమీమ్‌బాషా, వెంకటసుబ్బయ్య

మదనపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాంసం దుకాణాలతో పాటు వివిధ హోటళ్లను మంగళవారం ఆహార భద్రత అధికారి కె.షమీమ్‌బాషా, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. బెంగ ళూరు బస్టాండు, అంబేడ్కర్ సర్కిల్, ఎన్‌టీ ఆర్ సర్కిల్ ఏరియాలోని వివిధ హోటళ్లతోపాటు దక్నీపేట, నీరుగట్టు వారిపల్లె, బెంగళూరు బస్టాండు, రామా రావుకాలనీ ఏరియాలలో మటన్, చికెన్ దుకాణాలను పరిశీలించారు. ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచిన మటన్, చికెన్‌లను ఆహార ప దార్థాలుగా వాడరాదని సూచించారు. వీటిని కస్టమర్లకు పెడితే అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కూరలు, చికెన్, మటన్ వంటకాలకు పదేపదే వాడిన ఆయిల్‌ను ఉపయోగిస్తే జీర్ణకోశ, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వచ్చే అవకాశముందన్నారు. హోటళ్లు, చికెన్, మటన్ షాపులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లైసెన్సులు ఎప్పటికప్పుడు రెన్యువ ల్ చేసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆహార భద్రతశాఖ సీనియర్ అసిస్టెంట్ పి.సీతారామయ్య, మున్సిపల్ మేస్త్రీ రెడ్డెప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండకు నిప్పు..

మంటలను ఆర్పేసిన అటవీ సిబ్బంది



భాకరాపేట బీట్ పాలకొండలో మంటలను ఆర్పేస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కడప రేంజ్ అటవీశాఖ పరిధి సిద్దవటం మండలం భాకరాపేటబీట్ పాలకొం డ అడవికి సోమవారం రాత్రి ఆకతాయిలు నిప్పు పెట్టడం తో కడప ఫారెస్ట్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్‌బీవో ఇందిర, రాజశేఖర్‌రాజు, భానుకిషోర్, ప్రొటక్షన్ వాచర్లు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ వికాస్

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పీటీఎంకు చెందిన దొరిగుండ్ల వికాస్ (18) బైక్‌పై బి.కొత్తకోట నుంచి స్వగ్రామానికి వస్తుండగా బాంబే ఎస్టేట్ సమీపంలో అదుపు తప్పి కింద పడిపోయాడు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు 108 వాహనంలో బి..కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కోడూరు యువకుడు తిరువళ్లూరులో ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోడూరు పట్టణానికి చెందిన యువకుడు ఎం.ప్రతాప్ (30) సోమవారం రాత్రి తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతాప్ తిరువళ్లూరులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ప్రతాప్ మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో హుటాహుటిన బంధువులు తిరువళ్లూరుకు తరలివెళ్లారు. అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కోడూరుకు తరలించారు.

కోడిపందెం ఆడుతున్న ఏడుగురి అరెస్టు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోడిపందెం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మదనపల్లె పట్టణం రామిరెడ్డి లేఅవుట్‌లో కోడిపందెం ఆడుతన్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఆయన వివరించారు.

నలుగురు మట్కాబీటర్ల అరెస్టు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సంజీవనగర్‌లో మట్కా ఆడు తున్న నలుగురు వ్యక్తులను టూటౌన్ సీఐ సదాశివయ్య అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.26,500 నగదుతో పాటు మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో వాజ్‌పేయ్ నగర్‌కు చెందిన కాకి కుళాయప్ప, సంజీవనగర్‌కు చెందిన బండారు లక్ష్మీనారాయణ, బండారు శ్రీనాథ్, అంకట రాముడులు ఉన్నారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికను గర్భిణీని చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషను పరిధిలోని ఒక సప్లయిర్స్ దుకాణంలో పనిచేస్తున్న వ్యక్తి హోటల్లో పనిచేస్తున్న బాలికకు మాయమాటలు చెప్పి గర్భిణీని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా ఆరు నెలల గర్భిణిగా వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.

నేల ఆరోగ్యం.. రైతు సౌభాగ్యం

- ఖరీఫ్‌కు ముందే మట్టి పరీక్షలు
- జిల్లాలో 24,288 నమూనాల సేకరణే లక్ష్యం
- గత అయిదేళ్లలో అరకొరే
- ప్రభుత్వంపై రైతుల ఆశలు



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పొలంలో మంచి పంట పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్, పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. భూమిలో ఏయే పోషకాలు క్షీణించాయి, తదితరాలు వెలువడుతాయి. ఇంతటి కీలకమైన సమాచారం అందించే భూసార పరీక్షలను గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందే మట్టి పరీక్షలు చేయించాలని నిర్ణయించారు. 2025-26 ఏడాదికి కడపజిల్లాలో 24,288 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పోషకాలతో అధిక దిగుబడులు, భూసారం భద్రంగా ఉన్నప్పుడే మొక్కల ఎదుగుదల ఉంటుంది. తద్వారా దిగుబడి నాణ్యంగా ఉండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలు అయిన ఉదజనిసూచిక, లవణ పరిమాణం, నత్రజని, భాస్వరం, పొటాష్ లభించే మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. రసాయనిక ఎరువుల వాడకం జరిగిందని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. పంటల సాగుకు తగిన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ఫలితాల మేరకు పోషకాలను అందించి దిగుబడులు పొందవచ్చు.

సేకరణ ఇలా...

సాంప్రదాయ పద్ధతులను పక్కనపెట్టి సాంకేతిక దిశగా అడుగులు వేసేలా రైతన్నలను వెన్నుతట్టి ప్రోత్సహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కడపజిల్లాలో 17,800 అన్నమయ్య జిల్లాలో 16,500 మట్టి నమూనాలను సేకరించారు. ప్రస్తుతం జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 24,288 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నెల 15 నుంచి మే 15 వరకు ఈ సేకరణలను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. వ్యవసాయ శాఖ కడప డివిజన్ పరిధిలో 3,366, కమలాపురం 3,300, పులివెందుల 3,696, ముద్దనూరులో 2,674, ప్రొద్దుటూరు 3,102, మైదుకూరు 2,904, బద్వేలు 1,814, పోరుమామిళ్ళ 3,432 మొత్తం 36 మండలాల్లో 368 రైతు సేవా కేంద్రాల పరిధిలో 24,288 నమూనాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కడప, కమలాపురం, పులివెందుల, బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని 19 మండలాల్లోని 12,176 నమూనాలను సంచార భూసార పరీక్షల వాహనం (ఎంఎస్‌టీఎల్) ద్వారా విశ్లేషణ చేయాల్సి ఉంది. ముద్దనూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ళ డివిజన్లలోని 17 మండలాల పరిధిలో 12,112 మట్టి నమూనాలను ఊటుకూరు భూసార పరీక్షల కేంద్రానికి (ఎస్‌టీఎల్) పంపించాలి.

రైతు అవగాహన కలిగి ఉండాలి

జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. భూసార పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పారదర్శకత కోసం ఎస్‌హెచ్‌సీ యాప్ ఆధారిత సేవలు అనుసంధానం చేస్తున్నాం. రైతు పొలాల నుంచి నమూనాలను సేకరించి త్వరితగతిన పరీక్షలు చేసి సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి రైతులను అప్రమత్తం చేస్తాం.

- రాధాదేవి, ఏడీ, ఊటుకూరు భూసార పరీక్ష కేంద్రం

పకడ్బందీ ప్రణాళికతో....

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదలయ్యేనాటికి భూసారానికి సంబంధించిన ఫలితాలు అందించేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రబీ సీజన్ పూర్తవడంతో భూసార పరీక్షలు చేసేందుకు అనువైన సమయం లభించింది. ఈ క్రమంలో జిల్లాలో మట్టి నమూనాల సేకరణ, తరలింపు, పరీక్షించడం, ఫలితాలను రైతులకు అందించే కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. దీంతోపాటు రైతులకు ఆరోగ్యకార్డులను సైతం అందించనున్నారు. ఇందులోనే పరీక్షా ఫలితాలను పొందుపరచనున్నారు. ఫలితంగా వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

నమోదుకు ప్రత్యేక యాప్

నేలను బట్టి అయిదారు ఎకరాలకు ఒక నమూనాను సేకరించవచ్చు. నమూనా తీసే పొలంలో 10 నుంచి 20 చోట్ల మట్టిని సేకరించాలి. పారతో వి ఆకారంలో 6 నుంచి అంగుళాల గుంత తవ్వాలి. అందులోని మట్టిని పాలిథిన్ సంచిలో ఉంచి బాగా కలపాలి. ఆ మట్టిని నాలుగు భాగాలుగా విభజించి ఎదురెదురుగా ఉన్న భాగాలను తీసుకుని అరకిలో మట్టిని తీసేకుని పరీక్షకు పంపాలి. జిల్లా వ్యాప్తంగా గతంలో నిర్వహించిన పరీక్షల్లో ప్రధానంగా సేంద్రిక కర్బనం, నత్రజని, జింక్, ఐరన్ లోపాలను గుర్తించారు. తాజాగా భూసార పరీక్షలు చేపడితే భూమిలో నత్రజని, బోరాన్, జింక్, ఇనుము, పొటాష్, భాస్వరం, ఇతర సూక్ష్మపోషకాలు ఎంతమేరకు ఉన్నాయో తెలుస్తుంది. ఈసారి పక్కాగా పరీక్షించేందుకు ఎస్‌హెచ్‌సీ యాప్‌ను తీసుకొచ్చారు. పొలంలో మట్టి నమూనా సేకరణ స్థలం కనిపించే లా రైతులతో సెల్ఫీ తీసుకుని ఫోటో భద్రపరచాలి.



ల్యాబ్‌కు తరలించేందుకు సేకరించిన నమూనాతో ఏవో శివశంకర్‌రెడ్డి

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి ప్రతిభ



విద్యార్థి సుబ్బారెడ్డిని అభినందిస్తున్న ఎంఈవో సునీత

చెన్నూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో చెన్నూరుకు చెందిన బసిరెడ్డి సుబ్బారెడ్డి అనే విద్యార్థి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ మేరకు స్థానిక మం డల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో-2 సునీత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాదేవి, పద్మనాభం, రమణయ్య, ఉమామహేశ్వరి, అరుణ కుమార్‌లతో అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీల్లో విజయవాడలో ప్రత్యక అవసరాలు గల పిల్లలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో చెన్నూ రు భవిత సెంటరు నుంచి సుబ్బారెడ్డి పాల్గొని.. వంద మీటర్ల రన్నింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో మూడో బహుమతి గెలుచుకున్నారని తెలిపారు. ఈ విద్యార్థి ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణలయ్యారని తెలిపారు. ఈఆర్‌టీ ఎమ్మార్సీ సిబ్బంది గురవయ్య పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిక అధికారి కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడో తరగతికి సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు సంబంధించి గిరిజనులు మాత్రమే ప్రవేశానికి అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సంక్షేమ గురుకుల పాఠశాల కడప, పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్లలో సంప్రదించాలని కోరారు. ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ల కోసం మే 1వ తేదీ నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాఠశాలలోని ఖాళీల కంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తే మే 30వ తేదీ గిరిజన సంక్షేమ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని ఆమె వివరించారు.

సామాజిక అంశాలపై యువతకు అవగాహన

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ ద్వారా యువతకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారి క అధికారి డి.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళశారం నిర్వహించిన వీడియో కాన్ఫ రెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం, వార్డుల్లో కిశోర బాలికలకు ముఖ్యంగా 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు కలిగిన అమ్మాయిలకు గ్రూప్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారంలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అంగన్వాడీ వర్కర్స్, వీఓహెచ్‌లు కలిసి దాదాపు 12 అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించినట్లు వివరించారు. ఈ మేరకు షెడ్యూల్ ప్రకారం మే 2 నుంచి జూన్ 10 వరకు ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎం, మండల డెవలప్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వెల్లాల బ్రహ్మోత్సవాలు





వెల్లాల సంజీవరాయస్వామి , చెన్నకేశవస్వామి

రాజుపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అతి పురాతన పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను మే 8 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. ఆ మేరకు మంగళవారం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఈవో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా మే 8న (గురువారం) అంకురార్పణ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 9న (శుక్రవారం) శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, 11న (ఆదివారం) హనుమంతోత్సవం, 12న (సోమవారం) గరుడోత్సవం, నట రాజకళాక్షేత్రం ప్రొద్దుటూరు వారిచే సాంస్కృతిక నృత్య ప్రదర్శన, 14న (బుధవారం) రథోత్సవం, 16న స్వామివార్ల చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్స వాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మినారాయణరెడ్డి, గంగిరెడ్డి, మండల టీడీపీ నేత సుబ్బిరెడ్డి, ఆలయ మాజీచైర్మన్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పట్టించుకోడు...ప్రభుత్వం పట్టించుకోదు

- డిప్యూటీ సీఎంకు తులసిరెడ్డి లేఖ

వేంపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీని ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టించుకోడు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. సమస్యల వలయంలో చిక్కుకున్న వేంపల్లె మేజర్ పంచాయతీ గురించి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు తులసిరెడ్డి లేఖ రాశారు. అందులో వేంపల్లె మురికికూపంగా తయారైందని.. దాదాపు 60వేల జనాభా ఉంటుందని.. గత మార్చి 5వ తేదీ ఈఓను ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. ఈఓఆర్డీని బదిలీ చేసిందని, అప్పటి నుంచి ఈఓ, ఈఓఆర్డీలు లేరన్నారు. అవినీతి ఆరోపణలు, రాజకీయ జోక్యంతో భయపడి ఎవరూ రావడం లేదన్నారు. వాటర్ స్కీమ్ సిబ్బందికి ఆరు నెలలుగా, గ్రామ సచివాలయ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు లేవు, పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది.. తాగునీటి సమస్య జఠిలమైంది... ఇలా పంచాయతీకి సంబంధించి అనేక సమస్యలతో సతమతవం అవుతోందని.. వెంటనే ఈఓ, ఈఓఆర్డీలను నియమంచాలని కోరారు.

ఇందిరకు వైవీయూ డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పరంగా లభించే సాధారణ ప్రారంభ పదార్థాలు, పర్యా వరణ అనుకూల సింథటిక్ పద్ధతులను ఉపయోగించి మల్టీ ఫంక్షల్ ఆర్గానిక్ పదార్థాలను కనుగొన్నందుకు వైవీ యూ పీజీ కళాశాల రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ ఎం.ఇందిరకు యోగివేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు పి.వసు గోవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో డెవలప్‌మెంట్ ఆఫ్ సస్టైనబుల్ ఆర్గానిక్ సింథటిక్ ప్రొటోకాల్స్ ఎంప్లాయింగ్ అయానిక్ లిక్విడ్స్, బెమ్మిడజోలియం సాల్ట్స్ అండ్ అల్ట్రాసోనిక్ ఇర్రే డియేషన్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. పరిశీలించిన నిపుణుల బృందం థీసిస్‌కు డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఇకపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

సింహాద్రిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ప్రాంతీయ బ్యాంకులు విలీనం అయినట్లు సింహాద్రిపురం ఏపీజీబీ మేనేజర్ కృష్ణకిషోర్, ఫీల్డ్‌ఆఫీసర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ విలీనం అయ్యాయని తెలిపారు. ఈ నాలుగు బ్యాంకులు విలీనం అయి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా అవతరించినట్లు తెలిపారు. విలీనం అయినప్పటికీ ఖాతా నెంబర్‌లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు లేదా బ్రాంచ్‌చిరునామాలతో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు లేదని ఖాతాదారులకు తెలియజేశారు.

ఆరాధనోత్సవాలకు ప్రత్యేక బస్సులు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వాముల ఆరాధనోత్సవాలకు మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు మంగళవారం డిపో మేనేజరు శ్రీరాం కుమార్ తెలిపారు. ఆరాధనోత్సవాలకు 6వ తేదీ మధ్యాహ్నం నుంచి 8వ తేది రాత్రి వరకు బస్సులను నడపనున్నట్లు తెలిపారు. అలాగే మైదుకూరు నుంచి మిట్టమానుపల్లె మీదుగా బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, జ్యోతి క్షేత్రానికి కూడా బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సింహాద్రిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవరంగుట్టపల్లెకు చెందిన గోపాలదాస్ ఆశీర్వాదం (19) అనే యువకుడు కడుపునొప్పి తాళలేక మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఆశీర్వాదం గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుడేవాడు. పలు ఆసుపత్రులలో చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అన్న సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



అట్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురాయపల్లె జంగమకుంట వద్ద నాగదాసరి దేవేంద్ర (35) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. గోపవరం మండలం ఎస్.రామాపురం హరిజన వాడకు చెందిన దేవేంద్రకు మతిస్థిమితం లేదు. దీంతో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయాడు. ఈ మేరకు మృతుడి తండ్రి నాగదాసరి తిరుపాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గోపవరం అట్లూరు మండలాల మధ్య అటవీ ప్రాంతమైన సూరా యపల్లె సమీపంలో మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంళవారం సాయం త్రం ఎస్ఐ రామక్రిష్ణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కడుమూరు లక్ష్మిదేవి నేత్రదానం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం కచేరి రోడ్డులోని నాగయ్య ఆశ్రమంలో ఉంటున్న కడుమూరు లక్ష్మిదేవి (50) మంగళవారం మరణించడంతో ఆశ్రమం నిర్వాహకులు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు లక్ష్మీదేవి పార్థీవదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

10 నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న నారాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయం

జమ్మలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో వెలసిన నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 10వ తేదీ అంకురార్పణతో ప్రారంభం అవుతాయని ఆలయ అధికారి మోహన్ తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఉత్సవాల ప్రకటనను అధికారులతో కలిసి విడుదల చేశారు. అందులో భాగంగా మే 10వ తేదీ శనివారం అంకురార్పణతో బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 11న ధ్వజారోహణం, సాయంత్రం పెద్ద శేష వాహనం, 12న చిన్న శేష వాహనం, సాయంత్రం హంసవాహనం, 13న ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం సింహవాహనం, 14న కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమంత వాహనం, 15న మోహినీ అలంకారం, సాయంత్రం గరుడ వాహనం, 16న సర్వభూపాల వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, గజవాహనం, 17న శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి రథోత్సవం ఉంటుందన్నారు.సాయంత్రం అశ్వవాహనంలో ఊరేగింపు, 18న సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 19న చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 20న సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

వేలంలో సిండికేట్

నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం వివిధ దుకాణాలు, జాయింట్‌వీల్స్ తదితర వాటికి సంబంధించి వేలం నిర్వహించారు. ఓపెన్ టెండర్లకు సంబంధించి 13 మంది డీడీలు కట్టి ఆలయంలో అందజేశారు. టీటీడీకి సంబంధించిన వేలం రూ.10,00,111లతో అధికారులు ప్రారంభించారు. అయితే 13 మంది వేలంపాటదార్లలో పత్తి మహేంద్ర అనే వ్యక్తి మాత్రం పాల్గొని రూ.10.30 లక్షలకు వేలం దక్కించుకున్నారు. అదే 2023లో రూ.15.10 లక్షలు వేలం ద్వారా టీటీడీకి ఆదాయం వచ్చింది. 2024లో ఎన్నికల కోడ్ ఉన్నందున టెండర్లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. టీటీడీ డిప్యూటీ డీఈవో నటేష్‌బాబు, జేఈ కళావతి, సూపరింటెండెంట్ హనుమంతు, సిబ్బంది గురుస్వామి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్‌గ్రూప్ ప్రజల స్థితిగతులను గుర్తించాలి

- జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమా మహేశ్వరకుమార్

కడప, కలెక్టరేట్, ఏప్రిల్ 29,(ఆంధ్రజ్యోతి) హైరిస్క్‌గ్రూపు ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవాలని జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్ పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో హైరిస్క్ గ్రూప్ ప్రజల స్థితి గతులు, సమాజంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రీ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్ హైరిస్క్ గ్రూపుల వారి వివరాలకు సంబంధించి వారి అనుమతితో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి నగిలి రవిబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల సర్వేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ డాక్టర్ అనూష, జిల్లా ప్రోగ్రామ్ అధికారి అలీహైదర్, టిన్‌గోస్ ప్రాజెక్ట్ డైరెక్టర్స్, ఏఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలి

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా మే 1వ తేదీ కార్మికులకు సెలవు దినంగా ప్రకటించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో ఆయా సంస్థల యాజమాన్యాలను కోరారు. ఆయా దుకాణదారులు, సంస్థల యాజమాన్యాలు ఒక వేళ పని చేయించుకుంటే 30 రోజులలోపు ఒక రోజు సెలవు ఇచ్చి ఆ రోజుకు రెట్టింపు వేతనం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కార్మికులు కింది అధికారుల ఫోన్ నెంబర్లను కడప 9492555204, ప్రొద్దుటూరు 9492555209, కమలాపురం 9492555207, బద్వేల్ 9492555212, పులివెందుల 9492555213ను సంప్రదించాలన్నారు.

రెండో రోజూ కొనసాగిన రిలేనిరాహార దీక్ష



పులివెందుల రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎమ్‌యూఏ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎమ్‌యుఏ నాయకులు పీఎస్ఎన్‌రావు, డిపో చైర్మన్ జేవి రమణ, సీసీఎస్ డెలిగేట్ రామలింగారెడ్డి, రీజనల్ కమిటీ మెంబర్ ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎంరెడ్డి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో ఉద్యోగ భద్రతా తాలుకా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో అపరిష్కృతంగా ఉన్న కొన్ని సంవత్సరాలుగా పేరుకుని పోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాల ప్రధాన ఆర్టీసీ డిపోల ఎదుట రిలే నిరాహారదీక్షలు రెండోరోజు మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు ఎ.నాగరాజు, నాగేశ్వర్‌రావు,కడప డిపో అసిస్టెంటు సెక్రటరీలు కోడూరు సుబ్బారావు, నాగరాజు, రామచంద్ర, ఆదిలక్ష్మి, సునంద, దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు



కడప కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :నగర బిల్టప్ సమీపం విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు చేశారు. ఇలా చేయడం వల్లభక్తులు కోరుకున్నకోరికలు త్వరితగతిన నెరవేరగలవని ప్రగాఢ విశ్వాసం. జిల్లా నుంచే కాక రాయలసీమ జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి సేవలో తరిస్తున్నారు.

జన సైనికునికి ఘన నివాళి

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన జనసైనికుడు సోమిశెట్టి మధుసూదన్‌కు మంగళవారం విజయవాడలోని మంగళగిరిలో కడప జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తుంగా మాట్లాడుతూ జనసేనపార్టీ కోసం పనిచేసిన ఒక మంచి జనసైనికుని పోగొట్టుకోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొని సోమిశెట్టి మధుసూదన్ కుటుంబాన్ని ఆదుకుంటాననిచెప్పడం, ఆ కుటుంబానికి రూ.50లక్షలు ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అతికారి కృష్ణ, జివి రమణ, ఉంగరాల విజయ్, జనసైనికులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న తుంగా రమణయ్య

శివారు ప్రాంతంపై చిన్నచూపు..!

అధ్వానంగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ కాలనీ, సాగర్‌కాలనీ

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన 3వ డివిజన్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కాలనీ, సాగర్‌కాలనీలపై పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. మౌలిక వసతులు కూడా ఈ ప్రాంతాల్లో కరువయ్యాయి. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మౌలిక వసతులపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. ప్రధానమైన రోడ్లల్లో సిమెంటు రోడ్లు నిర్మించారు. కానీ వీధుల్లో ఎక్కడా సిమెంటు రోడ్లు నిర్మించలేదని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ కాలవులూ ఎక్కడా నిర్మించక పోవడంతో ఇళ్లల్లోని మురుగునీరు ఎక్కడం టే అక్కడ నిలువ ఉండడంతో దోమలు అధికంగా ఉన్నాయని, జ్వరాల భారిన పడి అవస్థలకు గురవుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో కొంత మంది నాయకులు కక్షపూరితంగా కొన్ని చోట్ల మాత్రమే సిమెంటు రోడ్లు నిర్మించారని అన్నిచోట్ల నిర్మించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర శివారు ప్రాంతమని పాలకులు, అధికారులు తమ కాలనీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.



సిమెంటు రోడ్డు లేకుండా అధ్వానంగా ఉన్న తిరుపాలయ్యవీధి

ఇటీవల తమ కాలనీకి ఎమ్మెల్యే మాధవి వచ్చినప్పుడు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా అన్ని మౌలిక వస తులు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలి పారు. అధికంగా వర్షాలు పడితే వర్షపు నీరంతా ఇళ్లలోకి చేరుతుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

వల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతలపత్తూరు గ్రామంలో ఉన్న ఇంద్రనాథేశ్వరాలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ప్రాతఃకాలాన్నే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రసహిత హోమాలను కార్యనిర్వాహకులు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు అలంకరించి కళ్యాణాన్ని చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేపట్టారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



పులివెందుల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఎస్ఎంఎస్ జీఎం శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ రామకృష్ణ, డీజీఎం రాములు అన్నారు. మంగళవారం తుమ్మలపల్లెలోని ఎస్ఎంఎస్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎస్ఎెస్ కంపెనీ మాజీచైర్మన్ అభయ్ సన్ సిటీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు.రక్తదాన శిబిరంలో సుమారు వందమంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ పవన్‌కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్‌కుమార్, అనంతపురం జిల్లారెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కుపై మోదీ ప్రకటన చేయాలి

సీపీఐ

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మే 2న అమరావతి పర్యటన సందర్భంగా కడప జిల్లాల ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగలో ఏర్పాటుచేస్తామని ప్రకటన చేసేలా చంద్రబాబు చొరవ చూపాలని సీపీఐ కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని మృత్యుంజయకుంట సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమస్య పరిష్కారం కోసం మే 2న అంబేద్కర్ సర్కిల్‌లో ప్రధాని పర్యటన సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, గోవిందు, తిమ్మయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రచారం ఉద్యమానికి కమిటీలు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప,కలెక్టరేట్, ఏప్రిల్ 29,(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమం మే నెలలో జరగబోయే సంవిధాన్ బచావో అభియాన్ కార్యక్రమంపై జిల్లా, నియోజక వర్గ,మండల,గ్రామ స్థాయిలో జరుగు కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో నాయకులు రామసుధాకర్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాష, శివమోహన్‌రెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సిరాజుద్దీన్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభం

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఉన్న లక్ష్మీసహిత చెన్నకేశవస్వామి స్థిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి లక్ష్మీసహిత చెన్నకేశవస్వామి ఆలయంలో లక్ష్మీసమేత స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూర్ణాహుతి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం 8గంటలకు వివిధ పూజలు జరిగాయి. సాయంత్రం ఆరుగంటలకు అంకురార్పణ ప్రధాన కలశారాధన, అగ్ని ప్రతిష్ఠ వాస్తు హోమం జలాదివాసం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

1న కల్యాణోత్సవం...: ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో మే 1వ తేదీన ఉదయం చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.

ఐటీఐలో సీట్లకు దరఖాస్తు చేసుకోండి

వేంపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని కందుల ఓబులరెడ్డి చారిటీస్ ఐటీఐలో 2025-26 సంవత్సరానికి వివిధ ట్రేడ్స్‌లో చేరడానికి 10వ తరగతి పాస్ అయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద రావు ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ,ప్లంబర్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులని మే 20లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్లంబర్ కోర్సుకు 10వ తరగతి ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

కడపసెవెన్ రోడ్స్, ఏప్రిల్ 29: రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఉదయం కడప కలెక్టరేట్ వద్ద 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వీఆర్‌ఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, అధ్యక్ష, కార్యదర్శులు వెంకటపతి,నాగేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణలు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దసంఖ్యలో వీఆర్‌ఏలు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు



మాట్లాడుతున్న ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు

చెన్నూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో ప్రతిరోజూ క్లాప్‌మిత్రల ద్వారా ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టాలని, తద్వారా ప్రతి గ్రామ పంచాయతీని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుకుంటామని ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు అన్నారు. చెన్నూరులో మంగవారం ఒంటిమిట్ట మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రాజవర్ధిని, శివకుమార్, చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను ఉరి తీయండి



కొవ్వొత్తుల నిరసనలో జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ అందాలను తిలకించేందుకు వెళ్లిన హిందువులను అక్కడి పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు అత్యంతకిరాతకంగా తుపాకులతో కాల్చి చంపడం దారుణమని ది కడప జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఉగ్ర ముష్కరుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన హిందూ పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ ది కడప జ్యువెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టీకేయం వీధిలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గోవిందునాగరాజు, సలావుద్దీన్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, చాంద్‌బాషా, సభ్యులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్ఐకి సన్మానం

చక్రాయపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణయ్య బదిలీ అయిన సందర్భంగా ఘన సత్కారం అందుకున్నారు. మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఘన వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ కృష్ణయ్యకు శాలువ, పూలమాలలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర,మాజీ సర్పంచు సుబ్బరామయ్య, ఉప సర్పంచు ఆంజనేయులు, రామకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్ రాజ్యాంగ విరుద్ధం

మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా



కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం నిర్వహించే లాంగ్‌మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని ఆయన కార్యాలయంలో లాంగ్‌మార్చ్‌కు సబంధించి కార్పొరేటర్లు,కోఆప్షన్ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ఈ రహదారికి మోక్షమెప్పుడో..?

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఉరుటూరు ప్రధాన రహదారి నుంచి రామాపురం వరకు నిర్మించిన రహదారి గుంతలమయంగా మారింది. సుమారు 17కిలోమీటర్లు వరకు రహదారి నిర్మించి ఉంది. నిత్యం ఈ రహదారిలో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్రవాహనంలో వెళ్లే వారు ఈ రహదారిలో ప్రయాణించాలంటే వణికిపోతున్నారు.



గుంతలమయంగా ఉరుటూరు- రామాపురం రోడ్డు

మౌలిక సదుపాయాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలోని కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు అవసరమైన మౌలిక సదుపాయాలకు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి రూ.2 లక్షలు ఆర్థిక సహకారం అందించారని, ఆసుపత్రి కమిటీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా విద్యుత్ సమస్య పరిష్కారం కోసం విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయంతో సరైన నిర్వహణ లేక ఆగిపోయిన ఎక్స్‌రే పరికరాలు, ల్యాబ్ టెస్టింగ్ పరికరాలు ఇప్పుడు నిరంతరాయంగా పనిచేస్తాయని ఆయన తెలిపారు.



అభివృద్ధి పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



చెన్నూరు అరుంధతీనగర్‌లో నిలిచిన మురుగునీరు

చెన్నూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు అరుంధతీనగర్‌లోని తూర్పుభాగంలో ఓ కాల్వను పూడ్చడంతో ఆ నీరంతా వీధుల్లో ప్రవహించి దుర్వాసనతో పాటు ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని స్థానిక నేతలు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకుని పోయి అందరూ సమన్వయంతో పనిచేసి ఆ నీటిని పూర్తిగా తొలగించారు. కాగా పార్టీలతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపినట్లు స్థానిక నేతలు పేర్కొన్నారు.



మురుగును తొలగించడంతో శుభ్రంగా ఉన్న రోడ్డు

ప్రభుత్వ భూముల జోలికివస్తే కఠినచర్యలు

● జలకళ బోర్లపై విచారణ ● నాయనపల్లె కొండపొరంబోకు భూముల్లో అక్రమ కరెంట్ సర్వీసుల గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

కాశినాయన ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఏస్థాయి లో ఉన్నవారైనా ప్రభుత్వ భూముల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ హెచ్చ రించారు. .మంగళవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విలేకరుల తో మాట్లాడుతూ నాయనపల్లె కొండ పొరంబోకు భూముల ఆక్రమణపై విచారణ వేగవంతంగా సాగుతోందన్నారు. 40 బ్లాకులుగా విభజించి విచా రణ చేస్తున్నామని దాదాపు 294 ఎకరాలు ఆక్రమిం చినట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. ఇక్కడ సాగుచేస్తున్న వారికి ఎలాంటి రికార్డులు లేవని కొంతమంది అర్జీ పట్టాలు ఉన్నాయని, పాతపట్టాలు ఉన్నాయంటూ ప్రచారం చేస్తున్న ట్లు తెలిసిందని అదంతా ఉత్తదేనన్నారు. జలకళ బోర్లు నాయనపల్లె ప్రభుత్వ భూముల్లో వేసినట్లు గుర్తించామని అవి ఎక్కడ మంజూరయ్యాయి ఎక్కడ తవ్వించారు అన్న విషయాలను సమగ్రంగా తేలుస్తామన్నారు. రెండు కరెంట్ సర్వీసులు మంజూరు చేయించుకొని 19 మోటార్లు నడు స్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలి పారన్నారు. వాటన్నిం టికి ఎవరెవరు సహకరించారు అన్న విషయాలపై ఆరాతీసు ్నామని సమగ్ర వివరాలతో త్వరలో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఈకార్యక్ర మంలో తహసీల్దారు వెంకటసుబ్బ య్య, డీటీ రవిశంకర్ ఆర్‌ఐ అమర్‌నాద్‌రెడ్డి, గ్రామ సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుని భూమి కౌలుకు వేలంపాట

చాపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అల్లా డుపల్లె వీరభద్రస్వామి సంబంధించిన భూమి, అంగడి, టీటీడీ కల్యాణ మండపం నిర్వహణకు మంగళవారం అధి కారులు వేలం పాటలు నిర్వహించారు. మొత్తం 4.13 ఎక రాల భూమి కౌలుకు రూ.61 వేలుకు సీతారామాపురం గ్రా మానికి చెందిన చిన్నపుల్లారెడ్డి వేలంలో పొందినట్లు దేవ స్థానం ఈవో శ్రీనివాసులు పేర్కొన్నారు. దేవస్థానం ఎదు రుగా దుకాణం నిర్వహించుకునేందుకు రూ.50,400లతో సీ తారామపురం గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి, టీటీడీ కల్యా ణ మండపం నిర్వహించుకునేందుకు ఏడాదికి రూ.3.30 ల క్షలతో అల్లాడుపల్లె గ్రామానికి చెందిన వీరారెడ్డి వేలంలో పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో మైదుకూరు ఎండో మెంట్ కార్యనిర్వహణ అధికారి ప్రసాదరావు, టీడీపీ నా యకులు నారాయణ, వీరారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలపాలి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్ర భుత్వం ఇటీవల తెచ్చిన వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఈనె ల 30వ తేదీ లైట్లు ఆఫ్ చేసి నిరసన తెలపాలని ప్రొద్దు టూరు జేఏసీ సభ్యుడు షేకల్ సలీం తెలిపారు. మంగళవా రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 9.15 గంటల వరకు లైట్లు స్విచ్ ఆఫ్ చేసి నిరసన వ్యక్తం చేయాలని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు, ప్రజా సంఘాలు, లౌకికవాదులు, కులమతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాల ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇదాయతుల్లా, మౌలా నా, మక్బుల్, అహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శంకర జ యంతి ఉత్సవాలను ఎంవీఎస్ ధ్యానమందిరంలో ఘనం గా నిర్వహిస్తున్నట్లు కైవల్య సత్సంగ్ సభ్యులు తెలిపారు. ఏప్రిల్ 30 నుంచి మే 2వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 నుంచి 1 గంట వరకు, సాయంత్రం 5.30 నుంచి 8 గం టల వరకు పారాయణాలు, ఉపన్యాసాలు ఉంటాయన్నా రు. మే 3వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు భగవద్గీత వేసవి శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చే సుకోవాలని కోరారు.

ప్రజా సౌకర్యాల కోసం పనిచేద్దాం

● అఖిలపక్ష సమావేశంలో నాయకుల వెల్లడి

దువ్వూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పార్టీలక తీతంగా పనిచేద్దామని పలువురు అభిప్రాయపడ్డారు. దు వ్వూరు గ్రామ సచివాలయంలో మంగళవారం నాయకులు సమావేశమయ్యారు. బస్టాండు సౌకర్యం, డ్రైనేజీ అస్తవ్య స్తంగా ఉండడం, ప్రయాణికులకు బాత్‌రూముల ఏర్పాటు లాంటి సమస్యలపై చర్చించారు. ఇప్పటికే బస్టాండు నిర్మా ణం కొరకు నిధులు మంజూరైన విషయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రస్తావించారు. మురుగునీరు ఊరిబయ టకు వెళ్లే విధంగా చేయాలని సమావేశంలో చర్చించారు. సర్పంచు చిన్నరాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు రాంబాబు, రమణయ్యనాయుడు, సుబ్బయ్య, గురప్పరాయల్, కోనేటి హరి, సత్యం, వెంకటనారాయణ, దానం, ఏకోపల్లి గౌస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రామాలయ వార్షికోత్సవాలు ప్రారంభం

దువ్వూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని రా మాలయం వీధిలో ఉన్న సీతారామ చంద్ర ఆలయ ద్విద శాబ్ది వార్షికోత్సవాలు మొదలు పెట్టారు. ఆలయం ఎదుట మంగళవారం స్థానికులతో శాంతిహోమం నిర్వహించారు. ఇక్కడి ఆలయం ప్రతిష్ఠించి 20 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో రెండు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు జ రుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం శ్రీరా మ కల్యాణం, అన్నసంతర్పణ, స్వామి ఊరేగింపు చేపడు తున్నట్లు నిర్వాహకులు లక్ష్మీనరసయ్య, శ్రీలక్ష్మి తెలిపారు.

వృద్ధాశ్రమం పునః ప్రారంభం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె సమీపంలో సెయింట్ జేవియర్ వృద్ధాశ్ర మంలో వృద్ధులు తమ శేష జీవితాన్ని గడపడానికి సకల సౌకర్యాలతో పునః ప్రారంభించామని, ఆ సంస్థ వ్యవ స్థాపకులు డాక్టర్ గీతా, చిత్త థోమాస్‌రెడ్డిలు అన్నారు. వృద్ధులకు ఇందులో ఆశ్రయం కల్పిస్తామన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే


బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్య కర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని మైదుకూరు ఎమ్మె ల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. ప్రొద్దుటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందచేశారు. మొత్తం 50 మంది బాధితులకు, సుమారు రూ.65 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రమాదాల్లో ,రోగాల బారిన పడిన ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేసి వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అంతేకాకుండా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు తోడుగా నిలుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ధనపాల జగన్, అన్నవరం సుధాకర్‌రెడ్డి, వెంకటరమాణారెడ్డి, బండి అమర్‌నాథ్ తదిత రులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు

బ ద్వేలు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బద్వేలు ఆర్టీసీ డిపోలో మార్చి నెలలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్ల కు ఆర్టీసీ డీఎం నిరంజన్ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు అందజేశారు. మంగళవారం స్థానిక డిపోలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఉత్తమ మైలేజీ తెచ్చినందుకు కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి బెస్ట్ మైలేజీ. గ్యారేజీలో మెకానిక్‌లు ఉత్తమ ప్రతి భ కనబరిచినందక వారికి ప్రతిభా అవార్డులు అందజేశామ న్నారు. డ్రైవర్లు హబీబుల్లా, పీవీ సుధాకర్, ఎస్‌ఏ ఆర్‌కే రెడ్డి కండెక్టర్లు కేఆర్ బాబు, నరసింహులు, హుసేన్, మోహన్, ఎలక్ట్రీషియన్ ప్రసన్నకుమార్‌లకు అవార్డులు అందుకున్నార న్నారు. ఉద్యోగులు, డ్రైవర్లు, కండెక్టర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు



జమ్మలమడుగులో దీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గేటు ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు మంగళవా రం కొనసాగాయి. డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆంజనేయులు, మూర్తి, రాయుడు, గౌరీశంకర్, వీఆర్‌ఎల్‌రెడ్డి, యోహాన్, ఎస్‌వీఎస్ రాముడు ఏడుగురు రిలే దీక్షలో కూర్చున్నారు. వారు మాట్లాడుతూ పెండింగ్ సమస్య లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండవ రోజు దీక్ష కొనసాగుతుందన్నారు.

బద్వేలు రూరల్‌లో : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు రెండో రోజుకు చేరుకున్నా యి. ఈ సందర్భంగా డిపో వర్కింగ్ ఇన్‌స్పెక్టరు జనార్ధనరావు మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత, మహిళా ఉద్యోగుల సెలవులు అన్ని డిపోలలో వెంటనే అమలు చేయాలన్నారు. రిలేదీక్షల్లో ఎస్‌కే బాషా, బిఎవెంకటభాస్కర్‌రెడ్డి, పిచ్చయ్య, ఎస్సీ హుసేన్‌లు కూర్చు న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, నేషనల్ మజ్దూర్ యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

జమ్మలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మే 1న నియోజకవర్గవ్యాప్తంగా జయప్రదం చేయాలని ఏఐ టీయూసీ పట్టణ నాయకులు ప్రసాద్ తెలిపారు. మంగళవా రం జమ్మలమడుగులోని ఎన్జీవో హోం నందు విలేకరుల స మావేశంలో ఆయన మాట్లాడారు.

డ్వాక్రా రుణాలకు ముడుపులు అడుగుతున్నారు

● యానిమేటరుపై ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు


సమావేశంలో మాట్లాడుతున్న చామంతి గ్రూపు సభ్యులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం డ్వాక్రా రుణాలకు సిఫారసు చే యమని యానిమేటరును అడిగితే తనకు ముడుపులు ఇస్తేనే చేస్తానని డి మాండ్ చేసిందని పోరుమామిళ్ల చిందా నంద నగర్‌కు చెందిన చామంతి గ్రూపు సభ్యులు ఆరోపించారు. ఆమేరకు యాని మేటరుపై జిల్లా ప్రాజెక్టు డైరెక్టరుకు ఫిర్యా దు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా చామంతి గ్రూపు సభ్యులు మాట్లా డుతూ గత 20 ఏళ్ల నుంచి పొదుపు డబ్బులు బ్యాం కులో కడుతున్నారని, ప్రస్తుతం ఐదు నెలలు అవుతుందని, లోను తీరిపోయి మరలా రుణం కోసం యానిమేటరును అడిగితే రూ.2వేలు ఇస్తారా, రూ.3వేలు ఇస్తారా అని డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నట్లు తెలిపారు. కాగా మంగళవారం బ్యాంకు వద్దకు పోయి అధికారులను అడిగితే ఆమె ఫైలే పెట్టలేదని తెలియజేశారన్నారు. తమకు బ్యాంకు రుణాలు ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎంపీ ల్యాడ్స్ పనుల పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న బృందం

పోరుమామిళ్ల, మే 29(ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో రాజ్యసభ సభ్యుడిగా సీఎం రమేష్‌నా యుడు గతంలో మంజూరు చేసిన రూ.30 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు పను లను సెంట్రల్ టీమ్ సభ్యుడు రాజేష్ మంగళవారం పరిశీలించా రు. బలిజకోట వీధిలోని సిమెంట్ రోడ్డు పనులను ఆయ న పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎనమల సుధాకర్, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డీసీసీబీ ఛైర్మన్ నియామకంపై పలువురి హర్షం


డీసీసీబీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న అరవ శ్రీనివాసులరెడ్డి, క్రిష్ణారెడ్డి, లక్ష్మీదేవి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రప్రభుత్వం డీసీసీబీ ఛైర్మన్‌గా మంచూరు సూర్యనారాయణరెడ్డిని నియమించడం పట్ల పలువురు నాయ కులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా మంగళవారం ఆయనకు ప్రము ఖ రైల్వేకాంట్రాక్టర్ అరవ శ్రీనివా సుల రెడ్డి, టీడీపీ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీ దేవి, 21, 22వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి క్రిష్ణా రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకులు, కార్య కర్తలు భారీసంఖ్యలో డీసీసీబీ ఛైర్మన్ నివాసం వద్దకు చేరుకొని ఆయనకు అభినం దనలు తెలిపారు. అనంతరం డీసీసీబీ ఛైర్మన్‌గా ఎన్నికైన సూర్యనారాయణరెడ్డి మాట్లా డుతూ పార్టీకి చేసిన సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించి బద్వేలు నియోజకవర్గానికి ఈ గౌరవం దక్కిందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డిలను డీసీసీబీ ఛైర్మన్ సూర్య నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భం గా డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డిని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమా ర్‌రెడ్డిలు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా సహకార బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన మంచూరు సూర్యనారాయణరెడ్డిని టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కొంకుల రాంబాబు పట్టణంలోని ఆయన నివాసగృహంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. టీడీపీ నేతలు కొంకుల వెంకటరమణ, కొంకుల శ్రీరాములుపాల్గొన్నారు. కాగా సంఘమిత్ర సంస్థ ఛైర్మన్ సొద్దల పెంచలయ్య డీసీసీబీ ఛైర్మన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తూతూ మంత్రంగా సాగిన కౌన్సిల్ సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధా

బద్వేలుటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని మున్సిపాలిటీలో జరిగిన సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. మంగళవారం సాయంత్రం కౌన్సిల్ సమావేశం 4గంటలకు ప్రారంభం కావాల్సిఉండగా అధికారులు తప్ప, ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, కొంత మంది కౌన్సిలర్లు సమయపాలన పాటించకపోవడంతో 4.40గంటలకు మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షత న నిర్వ హించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా హాజరయ్యారు. ఈ సమావేశానికి 36మంది కౌన్సిలర్లు హాజరుకావాల్సి ఉండగా 21మందే కౌన్సిలర్లు హాజరుకావడం గమనార్హం. కౌన్సిల్ సమావేశంలో 6వ వార్డులో వీధిలైట్లు వెలగడంలేదని, సీసీరోడ్లు, మురుగుకాలువలు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సుధామణి అర్జీ రూపంలో మున్సిపల్ ఛైర్మన్‌కు అందజేశారు. అలాగే మహబూబ్ నగర్‌లో వార్డులో సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించాలని 13వ వార్డు కౌన్సిలర్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఒకరిద్దరు తప్ప వార్డు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాకపోవడంతో సమావేశం అజెండాతోనే ముగిసింది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కొండాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలందరికి చేరువ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారుల ను కోరారు. ఎంఈవో రామయ్య మాట్లాడుతూ పాఠశాల మరమ్మతులకు సంబంధించి జూలై తర్వాత ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. విద్యుత్ నాణ్యతను మెరుగుపరిచేందుకు గ్రామాలలో త్రీఫేస్ కింద విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని ఇందుకు సంబంధించిన పనులు మండలంలో మొదలవుతాయని ఏఈ రామకృష్ణ తెలిపారు. ఉపాధి కింద గ్రామాలలో నీటితొట్టెలు ఏర్పాటు చేసుకోవచ్చని ఏపీవో వెంకటలక్ష్మి తెలిపారు. గొర్రెలు, పొట్టేళ్లు, నాటుకోళ్ల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని పశువైద్యాధికారి రాజశేఖ రరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఎంపీటీసీ రామమునిరెడ్డి, చామలూరు సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, ఏవో ఏవీరామాంజులరెడ్డి, హౌసింగ్ ఏఈ గురురాజ ,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


ఉపాధిహామీ పనుల వద్ద మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రాజుపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో వెంకటరమణయ్య మం గళవారం తనిఖీ చేశారు. అక్కడి కూలీ ల మస్టర్లు, పనులపై ఆరా తీశారు. గ్రామంలో స్వచ్ఛాంధ్రా.. స్వచ్ఛ భారత్ పై కూలీలకు, గ్రామ ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి-పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామపంచాయతిగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటి విషయంలో సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి


సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో ముకుందారెడ్డి

ముద్దనూరు ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యే క దృష్టి పెట్టాలని ఎంపీడీవో ము కుందారెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామ సందర్శనంలో భాగంగా మంగళవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప రిశీలించారు.గ్రామ సమీపంలో ని ర్వహిస్తున్న ఉపాధి పనులను ప ర్యవేక్షించారు.అంగన్వాడీ కేంద్రం, సచివాలయాన్ని పరిశీలించి పారిశుధ్యం , తాగునీరు, దృష్టి పెట్టాలని తెలిపారు. కా ర్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో కార్మికుల ర్యాలీ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు పండుగ మేడే సందర్భంగా మే1న కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్‌లు పేర్కొన్నారు. మంగ ళవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మేడే సందర్భంగా 1వ తేదీ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి శివాలయం సెంటర్ వ రకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 1వ తేదీ జరిగే ర్యాలీలో కార్మికులందరు పాల్గొని జ యప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ పాల్గొన్నారు.

ఉపయుక్తంగా ఉచిత కుట్టు శిక్షణ శిబిరం

జమ్మలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో ఉచిత కుట్టు శిక్షణ మహిళలకు ఉపయుక్తంగా ఉంటోంది. ఆంధ్రప్ర దేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడ బ్ల్యూఎస్‌వారి సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏప్రిల్ 5 నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో ఉదయం 70 మంది, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 70 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. మొత్తం 25 మిషన్లు ఏర్పాటు చేసి శిక్షణకు ఒక టీచర్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే 140 మంది మహిళలకు ఒకే ఒక టీచర్ శిక్షణ ఉండడం వల్ల ఇబ్బందికరంగా ఉందని కుట్టుశిక్షణలో పాల్గొంటున్న పలువురు మహిళలు వాపోతున్నారు. మరో నలుగురు టీచర్లను శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేయాలని తద్వారా శిక్షణ సులభతరమవుతుందని ఆదిశగా అధికారులు చొరవ చూపాలని వారు కోరతున్నారు. శిక్షణ 90 రోజులు అనంతరం వారికి సర్టిఫికెట్ అందజేస్తారు.